

సోమశిలలో 34.942 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 34.942 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 5996 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.64,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,778
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,951
నవర (8 గ్రాములు)	రూ.47,608

గరిష్టం/కనిష్టం
29.6 /23.4

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 77 శాతం ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రత సాధారణంగా ఉంది. శనివారం కూడా పొడి వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

‘ఆడుదాం ఆంధ్రా’పై ప్రత్యేక దృష్టి

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి సచివాలయాల ఉద్యోగులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆటలపై ఆసక్తి ఉన్న వారి పేర్లను నమోదు చేయాలన్నారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న వారి పేర్లను నమోదు చేయాలని తెలిపారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): అనధికారికంగా విధులకు గైర్హాజరు, క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ‘సంక్షేమ దివస్’ నిర్వహించారు. సిబ్బంది డిజార్డర్, సస్పెన్షన్ నుంచి రిలీవ్, గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, డిప్యుటేషన్, భద్రత తదితరాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై పలువురు ఎస్పీకి అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా ప్రతి శుక్రవారం ‘సంక్షేమ దివస్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 11 అంగన్‌వాడీ కార్యకర్తలు, 55 సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్ తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 19వ తేదీ సాయంత్రం లోపు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తుఫాన్ బాధితులకు సాయం



నెల్లూరు సిటీ: తుఫాన్ నేపథ్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెంలో కొండలపై నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి నిత్యావసర సరుకులు, టార్పాలిన్ పట్టలు, వంట పాత్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

11న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

నెల్లూరు(టౌన్): స్థానిక వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 11వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు సీకాఫ్ కంపెనీ, అదానీ కృష్ణపట్నం పోర్టు, గ్రీన్‌టెక్ కంపెనీ, ఎలక్ట్రోస్టీల్ కంపెనీ, ఏపీపీడీసీఎల్/ఎస్‌డీఎస్‌టీపీఎస్, భార్గవి ఆటోమొబైల్స్, ఏపీఎస్‌ఆర్టీసీ తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఐటీఐ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10 గంటలకు వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జరిగే అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని తెలిపారు.

భవిష్యత్‌కు భరోసా

నాడు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు చాలా దయనీయంగా ఉండేవి. జీతాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. జీతం పెంచాలని అడిగితే ఉద్యోగం ఉంటుందో పోతుందో తెలియని దుస్థితి. సమయంతో పనిలేకుండా విధులు నిర్వహిస్తూ... సిబ్బంది కొరత ఉన్నా వారితోనే సర్దుబాటు చేసేవారు. జీఓ నంబర్ 279 ద్వారా ప్రైవేట్ వ్యక్తుల కబంధహస్తాల్లో కార్మికుల జీవితాలు ఉండేవి.

నేడు గతానికి భిన్నంగా పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారికి ఉద్యోగ భద్రతను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జీఓ నంబర్ 279ను రద్దు చేసి ఆప్కాస్(ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్స్‌డ్ సర్వీసెస్)ను ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వం విస్మరించిన ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను (ఓహెచ్‌ఏ) అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుమారు రూ.6 వేలు అధికంగా కార్మికులకు అందుతోంది.

పారిశుద్ధ్య కార్మికులు ఈ సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. ఎండ, వాన, చలి, పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా విధులు నిర్వహించే వీరిని గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి జీవితానికి భరోసా కల్పిస్తూ ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు
- ఆరోగ్యం, ఉద్యోగ భద్రత కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్స్ పెంపుతో పెరిగిన జీతం
- నెల్లూరు నగరపాలక సంస్థలో 1,237 మందికి లబ్ధి



మెక్లిన్స్ రోడ్డులో చెత్తాచెదారాన్ని ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వారికి ఓహెచ్‌ఏ (ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు)ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా మున్సిపల్ కార్మికుల వేతనం రూ.15 వేలకు అదనంగా రూ.6 వేలు ఓహెచ్‌ఏను చెల్లిస్తోంది. దీంతో పారిశుద్ధ్య కార్మికుల వేతనం రూ.21 వేలకు పెరిగింది. ఈ ఉత్తర్వులతో నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వరిస్తున్న 1,237 మంది పారిశుద్ధ్య కార్మికులకు లబ్ధి చేకూరింది. జీఓ నంబర్ 233 ద్వారా ఇస్తున్న ఆరోగ్య భృతిని యథాతథంగా అమలు చేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలియజేసింది.

అండగా ప్రభుత్వం

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుండడంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. గతంలో కార్మికులు రూ.12 వేల వేతనంతో జీవితం వెళ్లదీసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రూ.15 వేలకు పెంచి వారికి ఊరట కలిగించింది. ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వ్యవస్థ (జీఓ నంబర్ 279)ను రద్దు చేసి ఆప్కాస్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించింది. అంతేకాకుండా ప్రభుత్వం కార్మికుల క్షేమం కోసం కోరుతూ వారికి హెల్త్ అలవెన్స్‌ను పెంచింది. గతంలో చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తూ వేతనం పెరిగేలా చర్యలు తీసుకోవడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా జీతాలందుతున్నాయి



నేను గత ఆరేళ్లుగా నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నాను. గతంలో జీతాలు సక్రమంగా ఇచ్చేవారు కాదు. మూడు, నాలుగు నెలలకోసారి వచ్చేవి. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందుతున్నాయి. జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ కింద రూ.6 వేలు అందుతోంది. ప్రభుత్వం మా ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం సంతోషంగా ఉంది.
– రేణుకమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, పొర్లుకట్ట



చిన్నబజార్ ప్రాంతంలో చెత్త, మట్టిని తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చాలా కాలంగా శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఇంటి అద్దెకు, ఇంటి ఖర్చులకే జీతం సరిపోయేది. ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తినప్పుడు అప్పులు చేయాల్సి వచ్చేది. మా ఆరోగ్య రక్షణ కోసం అదనంగా రూ.6 వేలు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు ఇవ్వడం హర్షించదగ్గ విషయం.
– జి.గురవయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, ఆనం వెంకటరెడ్డినగర్

ఆదుకుంటున్న ప్రభుత్వం



పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించిన ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోంది. ఇదే ప్రభుత్వం కొనసాగితే మాలాంటి కార్మికులందరం ఎంతో సంతోషిస్తాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని మేమంతా కోరుకుంటున్నాం.
– కె.విజయ్, పారిశుద్ధ్య కార్మికుడు, నెల్లూరు

ఉద్యోగ భద్రత కల్పించారు



ప్రజలకు సేవలు అందిస్తున్న మమ్మల్ని జగనన్న ప్రభుత్వం గుర్తించి ఆప్కాస్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించింది. నేను గత ఇరవై ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్నాను. గతంలో ఉద్యోగాలు ఉంటాయో పోతాయో తెలియని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం మా సేవలకు ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తూ జీతానికి అదనంగా రూ.6 వేలు ఇవ్వడం సంతోషకరం. – ఎస్.విజయమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, ఆనం వెంకటరెడ్డి నగర్

జగనన్న సీఎం కావడం చారిత్రక అవసరం



ఉలవపాడులో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్సీలు రఘురాజు, మాధవరావు
- ఉలవపాడుకు చేరిన పాదయాత్ర

ఉలవపాడు: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రక అవసరమని విజయనగరం జిల్లా శాసనమండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు, ప్రకాశం జిల్లా శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు అన్నారు. జగనన్న మళ్లీ సీఎం కావాలని తిరుమలకు 820 కి.మీ. రఘురాజు నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం ఉలవపాడు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడానికి ఆ వెంకటేశ్వరస్వామి ఆశీస్సుల కోసం జయహో జగన్ యాత్ర పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతోపాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని తెలిపారు. ముందుగా నెల్లూరు జిల్లాలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు రామాల శింగారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, ఎంపీటీసీ సభ్యులు మాధవరావు, శ్రీహరి, కొల్లూరి కొండయ్య, సచివాలయ కన్వీనర్ సోమయ్య పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 12న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్, పైసా బజార్, అపాచీ ఫుట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, ప్రొడక్షన్ వర్కర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

బీఈడీ కళాశాలలో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కింద బోధనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం, జీవశాస్త్రం, సైకాలజీ సబ్జెక్టుల బోధనకు అర్హులైన అధ్యాపకులు కావాలని తెలిపారు. ఎంఈడీ డిగ్రీతోపాటు సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతానికిపైగా మార్కులుండాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ లేదా ఎడ్యుకేషన్‌లో నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ లాంటి అదనపు అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి



బ్యాటింగ్ చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నగరంలోని ఎంపీ నివాసంలోని మైదానంలో శుక్రవారం సాయంత్రం ముందస్తుగా క్రికెట్ నిర్వహించారు. ఎంపీ ఆదాలతో పాటు డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. వార్డు, గ్రామ సచివాలయాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆడుదాం–ఆంధ్రాను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రూరల్ నియోజకవర్గంలోని క్రీడాకారులు తగిన విధంగా తోడ్పాటును అందించాలని కోరారు. రూరల్ నియోజకవర్గ క్రీడాకారులు గ్రామ, వార్డు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,రూరల్ నియోజకవర్గంలోని క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటు బాట

- ఓటర్ల జాబితా రూపకల్పనపై ముమ్మర కసరత్తు
- ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు నేటి వరకు గడువు
- క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తున్న సిబ్బంది
- పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)



వింజమూరులో బూత్‌స్థాయిలో దరఖాస్తు స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

జిల్లాలో..



ఓటర్లు	18,90,381
పురుషులు	9,25,013
మహిళలు	9,65,137
ఇతరులు	231
పోలింగ్ కేంద్రాలు	2317

ఉదయగిరి: జిల్లాలో ఓటర్ల జాబితా రూపకల్పన ముమ్మరంగా జరుగుతోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 9వ తేదీ తుది గడువుగా ఉన్నందున అధికారులు, బీఎల్వోలు పోలింగ్ బూత్‌ల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంతవరకు చేర్పులు, మార్పులు, తొలగింపులపై వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటరు జాబితా రూపకల్పన పారదర్శకంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఇప్పటికే ముసాయిదా జాబితా

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తుది ఓటరు జాబితాను తయారు చేస్తోంది. పాత ఓటరు జాబితా మదింపు ప్రక్రియ తర్వాత సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితా(డ్రాఫ్ట్)ను ఇప్పటికే ఉన్నతాధికారులు జారీ చేశారు. ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27న విడుదల చేశారు. ఆ జాబితాలో అభ్యంతరాలను స్వీకరించేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అందిన అభ్యంతాలను క్షేత్రస్థాయిలో నిశితంగా అధికారులు పరిశీలిస్తున్నారు. కలెక్టర్ హరినారాయణ్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నియోజకవర్గ రిటర్నింట్ అధికారులు పర్యవేక్షిస్తూ బూత్‌స్థాయి అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ప్రతి అభ్యంతరం క్షుణ్ణంగా పరిశీలన

జిల్లాలోని 37 మండలాల్లో 2,317 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న అభ్యంతరాలను బీఎల్వోలు నిశితంగా పరిశీలించి చేర్పులు, మార్పులు, తొలగింపులపై కసరత్తు చేస్తున్నారు. గత నెలలో రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో అనేక మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. ప్రధానంగా 18 నుంచి 21 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఓటు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అందిన దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటి వరకు ఫాం–6కు సంబంధించి 97,329 దరఖాస్తులు అందాయి. వాటిలో అధికారులు 71,974 దరఖాస్తులను ఆమోదించగా, 12,121 తిరస్కరించారు. ఇంకా 13,234 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఫాం–7కు సంబంధించి జిల్లాలో 1,61,014 దరఖాస్తులు అందగా, వాటిలో 1,22,045 అధికారులు ఆమోదించారు. 23,618 దరఖాస్తులు తిరస్కరించగా, 15,351 పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి



అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇందు కోసం బూత్ లెవల్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తాం. – హరినారాయణన్, కలెక్టర్

కానిస్టేబుల్‌పై దొంగ దాడి

• తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు



చికిత్సపొందుతున్న కానిస్టేబుల్ శ్రీనివాసులు

విడవలూరు: డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాసులుపై ఓ మైనర్ ఇనుప రాడ్డుతో దాడి చేసిన ఘటన శుక్రవారం వేకువజామున విడవలూరు పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు అల్లూరు మండలం నార్త్ మోపూరుకు చెందిన మైనర్ విడవలూరు మండలం అన్నారెడ్డిపాళేనికి వచ్చి గురువారం రాత్రి ఒక బైక్‌ను దొంగిలించాడు. దానిని తీసుకువస్తుండగా మార్గమధ్యంలో విడవలూరుకి వచ్చేసరికి బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో మరో ఇంట్లో ఉన్న బైక్‌లో నుంచి పెట్రోల్ దొంగతనం చేసేందుకు చొరబడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వ్యక్తులు అతనిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మైనర్ శుక్రవారం తెల్లవారుజామున తప్పించుకునే ప్రయత్నంలో భాగంగా పక్క గదిలో ఉన్న ఇనుప రాడ్డుతో కానిస్టేబుల్ శ్రీనివాసులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో గాయపడిన శ్రీనివాసులు పెద్దగా కేకలు వేయగా స్టేషన్‌లో ఉన్న ఏఎస్సై ఉలిక్కిపడి లేచి ముఖ్యమంత్రి బందోబస్తులో ఉన్న ఎస్సై ఆంజనేయులుకి సమాచారం అందించారు. దీంతో ఎస్సై విడవలూరులో ఉన్న కానిస్టేబుల్ నరసింహులు, కిరణ్‌లకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని ఆదేశించారు. వారు స్టేషన్‌కు వచ్చే లోపు మైనర్‌తో ఏఎస్సై ప్రతిఘటించి పట్టుకున్నారు. అదే సమయానికి స్టేషన్‌కి చేరుకున్న ఇద్దరు కానిస్టేబుళ్లు దొంగను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన కానిస్టేబుల్ శ్రీనివాసులును అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి చికిత్సపొందుతున్న శ్రీనివాసులును పరామర్శించారు. అనంతరం డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విడవలూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆయన వెంట కోవూరు సీఐ వెంకటేశ్వరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.

చెంగాళమ్మకు రూ.41 లక్షల కానుకలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకలను లెక్కించారు. 82 రోజులకు రూ.41 లక్షల కానుకలు వచ్చాయని ఇన్‌చార్జి ఈఓ వెంకటశ్రీనివాసులు తెలిపారు. సాధారణంగా 90 రోజులకు హుండీ కానుకలను లెక్కిస్తుంటారు. మిచాంగ్ తుపాన్ వల్ల హుండీల్లోకి నీరు పోయి నగదు తడిసిపోయింది. దీంతో ఇన్‌చార్జి ఈఓ వెంకటశ్రీనివాసులు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబుకు విషయం తెలియజేసి, వారి సమక్షంలో హుండీలను తెరిచి తడిసిపోయిన కరెన్సీ నోట్లను ఆరబెట్టారు. అనంతరం లెక్కించగా రూ.41,06,932 నగదు, 124 యూఎస్ఏ డాలర్లు, 75 యూఏఈ దిరమ్స్, నేపాల్ కరెన్సీ రూ.10 ఆదాయం వచ్చింది.

మూగ వేదనకు చెక్

పశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- ప్రతి నియోజకవర్గంలో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు
- సంచార పశువైద్యశాలలతో ఎక్కడికక్కడే వైద్యసేవలు
- జిల్లాలో ఇప్పటి వరకు 69,789 శాంపిల్స్ పరీక్షలు
- జిల్లాలోని ఏడు ల్యాబ్‌లకు ఐఎస్‌ఓ గుర్తింపు



గొర్రెను పరీక్షిస్తున్న ఏడీ చైతన్య కిషోర్

కోవూరు: పశుసంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నోరులేని మూగజీవాలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చింది. నియోజకవర్గాల వారీగా ప్రయోగశాలలను ఏర్పాటు చేయడంతో పాటు సంచార పశువైద్య క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వ్యాధుల నిర్ధారణతో పాటు వైద్యం సత్వరం లభిస్తుండడంతో జిల్లాలో మూగజీవాల మరణాల రేటు గణనీయంగా తగ్గింది. 2018–19 వరకు జిల్లాలో పశువులు అనారోగ్యాలకు గురైతే రైతులు గుడ్డిగా వైద్యం చేసేవారు. నాడు పశువైద్యం దైవాధీనం..నేడు పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. నియోజకవర్గాల వారీగా డాక్టర్ వైఎస్సార్ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిలో పశువులకు సోకే వ్యాధులను నిర్ధారించి సత్వరమే వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో మాత్రమే పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఉండేది. పశువులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు నిర్ధారణకు శ్యాంపిల్‌ను అక్కడకు పంపాల్సి వచ్చేది. అందువల్ల మూగ జీవాలకు మెరుగైన వైద్యం అందించడంలో జాప్యం జరిగి మరణాలు సంభవించేవి. నేడు జిల్లాలో ఎక్కడికక్కడే పశు వ్యాధులను నిర్ధారించి సత్వరమే వైద్యసేవలు అందిస్తుండడంతో మరణాలు గణనీయంగా తగ్గాయి. వివిధ సమస్యలపై రైతులు తమ పశువులను చికిత్స నిమిత్తం పశువైద్యశాలలకు తరలిస్తారు. సాధారణ సమస్యలుగా వైద్యులు భావిస్తే మందులిచ్చి పంపిస్తారు. ఏదైనా సమస్య ఉన్నట్లు అనుమానం వస్తే దానికి సంబంధించిన రక్తం, పేడ, మూత్రం శాంపిళ్లను తీసి సమీపంలోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు పంపుతారు. జిల్లాలో 8 పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన నెల్లూరుతో పాటు పొదలకూరు (సర్వేపల్లి) సౌత్‌మోపూరు (నెల్లూరు రూరల్), కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరులో ఇవి ఉన్నాయి. వీటిని 2021 ఏప్రిల్‌లో ప్రారంభించారు. ప్రతి ల్యాబ్‌లో నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లను నియమించారు. జిల్లాలో ఇప్పటి వరకు 69,789 శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గాల్లోని ఏడు పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌ఓ) గుర్తింపు ఉంది. ఈ ప్రయోగశాలలను ఐఎస్‌ఓ ప్రతినిధుల బృందం పలుమార్లు పరిశీలించి పరీక్షలపై సంతృప్తి చెంది ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు జారీ చేసింది.

ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు

నియోజకవర్గ కేంద్రాల్లోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలను నిర్వహిస్తారు. అందుకు అవసరమైన అధునాతన పరికరాలతో పాటు కెమికల్స్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎటువంటి కొరత లేకుండా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. మైక్రోస్కోప్, బయోకెమికల్స్, అనలైజర్, ఇంక్యూబేటర్, లామినార్ ఎయిర్‌ఫ్లో, హార్ట్ ఎయిర్ ఓపెన్ వంటి అధునాతన వైద్యపరికరాలు కూడా ఉన్నాయి. రక్తం, మూత్రం, పేడ, సీరం, లవణాల శాతం, కాలేయ, పొదుగు వాపు, చర్మ వాపులకు సంబంధించిన పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు కూడా చేస్తారు. జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తే ఏ స్థాయిలో అది పనిచేస్తుందన్న దానిని కూడా నిర్ధారిస్తారు. పశువులు మరణిస్తే ఏ విధంగా ఏ కారణంతో మరణించాయో కూడా పోస్టుమార్టం ద్వారా తెలియజేస్తారు. అలాగే జిల్లా కేంద్రంలోని పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో 20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అగ్రిఎనలైజర్ యంత్రం ద్వారా సైలేజ్‌లో ఉన్న పోషకాల శాతాన్ని నిర్ధారిస్తారు.



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు



వెటర్నరీ మెడికల్ క్యాంపులో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు

జిల్లాలోని పశు సంపద వివరాలు	
తెల్లజాతి పశువులు	57,774
నల్లజాతి పశువులు	6,46,088
గొర్రెలు	10,95,195
మేకలు	3,86,929
కోళ్లు	19,31,113

క్వాలిఫైడ్ టెక్నీషియన్లతో పశువ్యాధుల నిర్ధారణ



పశు సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అందుకనుగుణంగా నియోజకవర్గాల వారీగా పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిలో క్వాలిఫైడ్ టెక్నీషియన్లను నియమించి అవసరమైన వైద్య పరీక్షల మెషీన్లను అందుబాటులో ఉంచింది. 2021 ఏప్రిల్ నుంచి పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లాలో 69,789 శాంపిళ్లను పరీక్షించి వ్యాధులను నిర్ధారించాం. పశువులకు సకాలంలో వైద్యసేవలు అందించడం ద్వారా మరణాలను తగ్గించగలిగాం.

– డాక్టర్ జానా చైతన్యకిషోర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, నెల్లూరు

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కృష్ణాపురంలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడు మజరా కృష్ణాపురం, గంగపట్నం మజరా కాలువమూలకండ్రిగ గ్రామాల్లోని రైతులకు శుక్రవారం ఆయన అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతుల సంక్షేమానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రజలు ఏ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారో తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. గతంలో ఎందరో ముఖ్యమంత్రులను చూశామని, చుక్కల, అసైన్‌మెంట్ భూముల సమస్యలపై దృష్టిసారించిన వారు లేరన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పట్టాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా అసైన్‌మెంట్ భూములను సాగుచేసుకుంటున్న వారికి ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టాలు అందజేస్తోందని తెలిపారు. మండలంలోని కృష్ణాపురంవాసులు సాగు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని అనేక దఫాలుగా గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నారని చెప్పారు. ఏ ముఖ్యమంత్రి స్పందించిన పాపాన పోలేదన్నారు. ఈ విషయమై స్థానిక యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి తనను, కలెక్టర్‌ను నిద్ర పోనీయకుండా వెంటబడి పట్టాలు వచ్చేలా కృషిచేశారని అభినందించారు. గ్రామంలోని 33 మందికి 31.64 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. కోవూరు నియోజవర్గంలో ఐదు మండలాలకు సంబంధించి 2673 ఎకరాలను, జిల్లా వ్యాప్తంగా 43270 ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను ప్రభుత్వం 22(ఏ) నుంచి తొలగించి అనుభవదారులకు శాశ్వత హక్కులను కల్పించిందని వివరించారు. గతంలో సీఎంగా పనిచేసిన చంద్రబాబు భూ సమస్యలపై ఏనాడైనా దృష్టి సారించారా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో వైఎస్సార్‌సీపీకి నాయకులు, కార్యకర్తలు, అధికారులు మాత్రమే ప్రజల దగ్గరకొచ్చి పలుకరించి ధైర్యం చెప్పడంతో పాటు సాయం అందించారని గుర్తుచేశారు. నాలుగున్నరేళ్ల పాటు కనిపించని వారు ఎన్నికలు వస్తున్నాయని రకరకాల చొక్కాలు తొడిగి తిరుగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలను గాలికొదిలేసిన వారు ఇప్పుడు మాటలు చెప్పి పోతారన్నారు. మీ గుండెల మీద చేయి వేసుకుని మీకు పనిచేసిన వారిని గుర్తు పెట్టుకుని ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నాయకులు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.10
పండ్లు	: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 80
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 150
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 170
లేయర్ చికెన్	: 153

పథకాలపై అవగాహనతో ఉపాధి అవకాశాలు

–బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్



కొడవలూరులో మాట్లాడుతున్న సత్యకుమార్

కొడవలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవచ్చని బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ తెలిపారు. మండలంలోని వెంకన్నపురంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగులకు చేతి వృత్తులపై శిక్షణిచ్చి రుణ సదుపాయం కల్పించే విశ్వకర్మ యోజనతో పాటు ఎంఎస్‌ఎంఈ, పీఎంఈజీపీ, కేవీసీ, తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిపై యువతలో సరైన అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డ్రోన్ సాయంతో ఎరువులు, పురుగు మందుల పిచికారీ చేయడంపై రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కే రాజేశ్వరమ్మ, నాయకులు విజయశ్రీ, రాఘవేంద్రరావు, మురళీకృష్ణ, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నెల్లూరు(బారకాసు): మిచాంగ్ తుఫాన్ కారణంగా తీవ్రంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నెల్లూరు వచ్చిన ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిచాంగ్ తుఫాన్ విలయానికి ఆంధ్రప్రదేశ్ కుదేలైందన్నారు. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునగడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. పార్టీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోవూరు విద్యార్థినులు



క్రీడాకారిణులతో ఉపాధ్యాయులు

కోవూరు : స్థానిక వచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికవడం సంతోషకరమన్నారు. పీడీ దేవిక, పీఈటీ వెంకటసుబ్బమ్మ విద్యార్థినుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చర్యలు తీసుకుని పాఠశాల పేరు ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేశారని కొనియాడారు. పీడీ దేవిక మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీల్లో రాణించి అండ్– 14,17,19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విజయనగరం జిల్లా రాజీవ్ స్టేడియంలో ఈ నెల 11,12,13 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. గతంలోనూ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాకు 18 పతకాలు సాధించి పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతామాధురి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వన భోజనాలకు తరలిరండి



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్, తదితరులు

నెల్లూరు(బృందావనం): ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని వేణుగోపాలస్వామి కళాశాల మైదానంలో ఆర్యవైశ్య కార్తీక వన భోజనాలను అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సుమారు 10 వేల మంది ఆర్యవైశ్య సంఘీయులతో వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. తొలుత సత్యనారాయణస్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహించనున్నామని వివరించారు. ఆర్యవైశ్యులు తరలిరావాలని కోరారు. పేర్ల సీతారామారావు, శ్రీరామ్‌సురేష్, జ్యోతిప్రసాద్, సుంకు మనోహర్, కామేశ్వరరావు, వైభవ్ శ్రీనివాస్, సుబ్బయ్య, మురళి, సత్యకృష్ణ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద హైడ్రామా

నెల్లూరు(క్రైమ్): సివిల్ వివాదంలో న్యాయం చేయలేదంటూ ఓ వ్యక్తి పోలీసుస్టేషన్ వద్ద హైడ్రామాకు తెరలేపారు. వివరాలు.. నెల్లూరు నగరానికి చెందిన అఫ్జల్ ఆటోనగర్‌లో స్పేర్ పార్ట్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఓజిలికి చెందిన ప్రసన్న నగదు బాకీ ఉన్నాడు. బాకీ విషయమై అఫ్జల్ ఈ ఏడాది మేలో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పెద్దమనుషుల సమక్షంలో ప్రసన్నకు చెందిన వరికోత మిషన్‌ను అఫ్జల్ కొనుగోలు చేసి బాకీ పోగా మిగిలిన నగదును ప్రసన్నకు చెల్లించేలా ఇరువురూ ఒప్పందపత్రం రాసుకున్నారు. అఫ్జల్ వరికోత మెషీన్‌ను బాడుగకు తిప్పుకుంటూ ప్రసన్నకు మిగిలిన నగదు చెల్లించకపోవడంతో వెంకటగిరిలో ఉన్న వరికోత మెషీన్‌ను ప్రసన్న స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఘటనపై అఫ్జల్ వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఘటన జరిగిన ప్రాంతం వెంకటగిరి కావడంతో అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. శుక్రవారం తనకు పోలీసులు న్యాయం చేయలేదంటూ వేదాయపాళెం పోలీసుస్టేషన్ వద్ద అఫ్జల్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరిస్తూ హైడ్రామాకు తెరలేపాడు. సివిల్ వివాదంలో తల దూర్చబోమని, వెంకటగిరిలోనే ఫిర్యాదు చేయాలని తేల్చిచెప్పడంతో అఫ్జల్ వెనుదిరిగాడు.

హత్య కేసులో విచారణ వేగవంతం

నెల్లూరు(క్రైమ్): వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటనలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. పోలీసుల దర్యాప్తు మేరకు వివరాలు...కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన విజయచంద్రపాల్(56)కు వివాహమై భార్య, సంతానం ఉన్నారు. ఆయన బుజబుజనెల్లూరు సమతానగర్‌కు చెందిన ఓ మహిళతో మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. సదరు మహిళకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమై ఆమె ఇంటికి కొద్దిదూరంలోనే ఉంటోంది. ఈ నెల 6న రాత్రి సదరు మహిళ తన కుమార్తె వద్దకు వెళ్లిన సమయంలో విజయచంద్రపాల్ ఆమె ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో చంద్రపాల్‌తో మద్యం మత్తులో ఉన్న స్నేహితురాలి కుమారుడు గొడవపడి దాడికి పాల్పడ్డాడు. అనంతరం జరిగిన విషయాన్ని తన తల్లికి తెలియజేయగా ఆమె తన బంధువుతో కలిసి చంద్రపాల్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లి పడారుపల్లి సుందరయ్యకాలనీ వద్ద పడేసి వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఇప్పటికే ఈ ఘటనపై హత్యకేసు నమోదు చేసిన వేదాయపాళెం పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.